

విలీనం కోసం వినతులు

విద్యాశాఖలో తమను కూడా విలీనం చేయాలని కోరుతూ ఐఈఆర్పీలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

- 8లో ▸



రెండ్రోజుల్లో 50.7 మి.మీ వర్షం

జిల్లాలో గడిచిన 24 గంటల్లో 50.7 మి.మీ. వర్షపాతం నమోదైందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
28.5 /22.9

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చల్లటి గాలులు వీస్తాయి. మధ్యాహ్నం చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. సాయంత్రం భారీ వర్షం కురియవచ్చు.

న్యూస్‌రీల్

ఆర్టీసీ లక్కీడ్రా విజేతలకు బహుమతులు



ఖలీల్‌వాడి : ఆర్టీసీ ఆధ్వర్యంలో రాఖీ పండుగ సందర్భంగా లక్కీడ్రాను నిర్వహించగా మంగళవారం ఆర్టీసీ రీజినల్ కార్యాలయంలో ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా సెషన్స ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణం సురక్షితమన్నారు. లక్కీడ్రాలో నవీపేట్ మండలం కోస్లి గ్రామానికి చెందిన గోదావరికి మొదటి బహుమతి రూ. 25 వేలు, తాడ్వాయిలోని బ్రాహ్మణపల్లికి చెందిన సునంద రెండవ బహుమతిగా రూ. 15 వేలు, ఆర్మూర్‌కు చెందిన పద్మకు మూడో బహుమతిగా రూ. 10 వేలు గెలుపొందినట్లు ఆర్టీసీ ఆర్‌ఎం జానీరెడ్డి తెలిపారు. డిప్యూటీ రీజినల్ మేనేజర్లు సరస్వతి, శంకర్, డిపో మేనేజర్లు ఆనంద్, సాయన్న, పర్సనల్ ఆఫీసర్ పద్మజ, అకౌంట్స్ ఆఫీసర్ చంద్ర శేఖర్, అసిస్టెంట్ మేనేజర్ దినేశ్‌కుమార్,ఉద్యోగులు,విద్యార్థులు పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్ తనిఖీ



సుభాష్‌నగర్ : జిల్లా కేంద్రంలోని వినాయక్ నగర్‌లో ఉన్న ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మంగళవారం సందర్శించారు. ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్లు, ఎన్నికల సామగ్రిని భద్రపర్చిన గదులను పరిశీలించారు. పోలీస్ భద్రత, అగ్నిమాపక సిబ్బంది విధులు నిర్వహిస్తున్న తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. కలెక్టర్ వెంట ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్ అధికారులున్నారు.

వాహనాల వేలం వాయిదా

ఖలీల్‌వాడి : నిజామాబాద్ పోలీస్ కమీషనరేట్ పరిధిలోని వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఆచూకీ లేకుండా వదిలేసిన సుమారు 226 బైక్‌లు, ఆటోలకు సంబంధించి వేలాన్ని వాయిదా వేసినట్లు సీపీ సత్యనారాయణ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఎల్లమ్మగుట్ట పోలీస్‌లైన్‌లో ఈనెల 6న ఉదయం 11 గంటలకు వేలం ఉండగా వాయిదా వేస్తున్నట్లు పేర్కొన్నారు. వేలం నిర్వహణ తేదీని ప్రకటిస్తామన్నారు.

నిజాంసాగర్‌లోకి భారీగా వరద

నిజాంసాగర్: నిజాంసాగర్ ప్రాజెక్టులోకి భారీ ఇన్‌ఫ్లో వస్తోంది. మంగళవారం సాయంత్రం 46 వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోందని అధికారులు తెలిపారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని హల్దివాగు, ఘనపురం ఆనకట్టల ద్వారా 36 వేల క్యూసెక్కులు, పోచారం ప్రాజెక్టు నుంచి 10 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నిజాంసాగర్‌లోకి వస్తోందన్నారు. దీంతో ప్రాజెక్టు వరద గేట్ల ద్వారా 46 వేల క్యూసెక్కుల నీటిని మంజీరలోకి వదులుతున్నామన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 17.8 టీఎంసీలు గాను మంగళవారం సాయంత్రానికి 17.079 టీఎంసీలు నీరు నిల్వ ఉందన్నారు.

నకిలీ ఓట్ల రాజకీయం

- బీఆర్‌ఎస్ నాయకులు దొంగ ఓట్లు చేర్పిస్తున్నారంటున్న కాంగ్రెస్ నేతలు
- జిల్లాలోని ఆర్మూర్, నిజామాబాద్ అర్బన్, బోధన్ సెగ్మెంట్లలో నకిలీ ఓట్ల వ్యవహారం
- రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారికి కాంగ్రెస్ ఎన్నికల కోఆర్డినేషన్ కమిటీ ఫిర్యాదు



రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

రానున్న ఎన్నికల నేపథ్యంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్య పోటాపోటీ నెలకొంది. ఈ క్రమంలో అధికార పార్టీ నేతలు దొంగ ఓట్లను నమోదు చేయిస్తున్నారన్న కాంగ్రెస్ నాయకుల ఆరోపణలు తీవ్ర కలకలం రేపాయి. ఆర్మూర్ నియోజకవర్గం మాక్లూర్ కేంద్రంగా, బోధన్‌లోనూ, నగరంలోని మాలపల్లి వద్ద పోలింగ్ కేంద్రంలో కథ నడిపారని ఏకంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశారు.

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ రాజకీయ పార్టీలు కార్యకలాపాలను మరింత ముమ్మరం చేస్తున్నాయి. పార్టీ టిక్కెట్ల ఎంపిక, క్షేత్రస్థాయి ప్రచారాలతో పాటు ప్రత్యర్థి పార్టీల కదలికలపై ఆయా పార్టీలు నిఘా పెడుతున్నాయి. ఈ క్రమంలో మరోవైపు అధికార యంత్రాంగం ఓటర్ల నమోదు, ముసాయిదా జాబితా తయారీకి సంబంధించి కార్యాచరణ చేస్తోంది. ఈ నేపథ్యంలో అధికార బీఆర్‌ఎస్, ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీల మధ్య పోటాపోటీ నెలకొంది. అధికార పార్టీ నాయకులు దొంగ ఓట్లు నమోదు చేస్తున్నారంటూ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ ఆరోపణలకు బలం చేకూర్చేలా ఇటీవల చోటుచేసుకున్న ఘటనలు గందరగోళం సృష్టిస్తున్నాయి. ఈ నెల 3న నిజామాబాద్ సౌత్ తహసీల్దార్ కార్యాలయంలో చోటు చేసుకున్న ఘటన కలకలం రేపింది. కాగా నకిలీ ఓట్ల నమోదుకు సంబంధించిన వ్యవహారం రాజధాని వరకు పాకింది. తాజాగా మంగళవారం టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు, ఏఐసీసీ సభ్యుడు, పార్టీ ఎన్నికల కమిటీ కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్ జి నిరంజన్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్‌బిన్ హందాన్, నిజామాబాద్ డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, నగర అధ్యక్షుడు కేశ వేణు, టీపీసీసీ ఎన్నికల కమిటీ కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ రాజేష్‌కుమార్‌లు, రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి వికాస్‌రాజ్‌ను కలిసి ఈ నకిలీ ఓట్ల వ్యవహారంపై ఫిర్యాదు చేశారు. నకిలీ ఓట్ల రాకెట్‌పై సమగ్ర పారదర్శక విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆర్మూర్ నియోజకవర్గంలో మాక్లూర్ కేంద్రంగా అధికార పార్టీ నాయకులు నకిలీ ఓట్లు నమోదు చేసే కార్యక్రమం చేస్తున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా బోధన్ నియోజకవర్గంలోనూ ఇదే పరిస్థితి నడుస్తోందన్నారు. మహారాష్ట్ర సరిహద్దులో ఉండడంతో ఈ నియోజకవర్గాల్లో ఆ రాష్ట్ర వ్యక్తులను ఓటర్లుగా నమోదు చేసే వ్యవహారం నడుస్తోందని కాంగ్రెస్ నాయకులు అంటున్నారు. ఇక నిజామాబాద్ అర్బన్ పరిధిలో తాజాగా మాలపల్లి వద్ద 261 పోలింగ్ కేంద్రం పరిధిలో కొందరు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి 2021 ఓటరు జాబితా పట్టుకుని వ్యవహారం నడుపుతున్నట్లు కాంగ్రెస్ నాయకులు మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. కమిషనర్ ఆదేశంతో తహసీల్దారు విచారణ చేశారు. పోలీసుల సహకారంతో ముగ్గురు వ్యక్తులను పట్టుకున్నారు. మరికొందరు పారిపోయారు. ఈ క్రమంలో కాంగ్రెస్ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఏకంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి వద్దకు వెళ్లి ఫిర్యాదు చేయడాన్ని బట్టి ఈ విషయాన్ని ఆ పార్టీ తేలికగా తీసుకునే ఉద్దేశం లేదని చెబుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో అధికార యంత్రాంగం సైతం మధ్యలో ఇబ్బందులను ఎదుర్కొనే వాతావరణం నెలకొంటోంది. రానురాను ఎన్నికల క్రతువులో ఓటర్ల నమోదు ప్రక్రియ అంశం కీలకం కానుంది.

వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి

- అధికారులకు సూచించిన మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి
- జెడ్పీ చైర్మన్, కలెక్టర్‌తో కలిసి సమీక్ష



మాట్లాడుతున్న మంత్రి ప్రశాంత్ రెడ్డి



సమావేశంలో పాల్గొన్న అధికారులు

సుభాష్‌నగర్ : జిల్లాకు భారీ వర్షసూచన ఉందని వాతావరణ శాఖ సూచించిన నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రోడ్లు–భవనాల శాఖమంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సూచించారు. వర్షాల వల్ల ఎలాంటి పరిస్థితి ఉత్పన్నమైనా, సమర్థవంతంగా ఎదుర్కొనేలా అన్ని శాఖల అధికారులు, సిబ్బందిని సమాయత్తం చేయాలన్నారు. ఆయా శాఖల అధికారులు, సిబ్బంది కార్యస్థానాల్లోనే అందుబాటులో ఉంటూ క్షేత్రస్థాయిలో పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలన్నారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, పి యాదిరెడ్డితో కలిసి జిల్లాలో వర్షాల వల్ల నెలకొన్న పరిస్థితుల గురించి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. జూలై మాసంలో కురిసిన అతి భారీ వర్షాల వల్ల దెబ్బతిన్న రహదారులు, తెగిన చెరువులు, వాగులు, నీట మునిగిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, కూలిన కరెంటు స్తంభాలు తదితర వాటి పునరుద్ధరణ పనుల వివరాలను శాఖల వారీగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. మంత్రి మీడియాతో మాట్లాడుతూ రెండ్రోజుల నుంచి జిల్లాలో పలుచోట్ల మోస్తారుగా, మరికొన్ని చోట్ల భారీ వర్షాలు కురుస్తున్నాయన్నారు. ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా అదుపులోనే ఉందన్నారు. తాజా వర్షాలకు 12 పాత ఇండ్లు పాక్షికంగా ధ్వంసమయ్యాయని, బాడ్సి మాదం చెరువుకు గండిపడిందన్నారు.





పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి రోడ్లు అక్కడక్కడా స్వల్పంగా దెబ్బతిన్న చోట తక్షణమే పునరుద్ధరణ పనులు చేయిస్తున్నామని తెలిపారు. బాడ్సి చెరువు పరీవాహక ప్రాంత ప్రజలతోపాటు పులాంగు వాగును ఆనుకుని నివసిస్తున్న వారిని పునరావాస కేంద్రాలకు తరలించి వసతి కల్పిస్తున్నామన్నారు రానున్న 24గంటల్లో భారీ వర్షసూచన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉందని, ప్రజలు ఆందోళన చెందవద్దని మంత్రి భరోసా కల్పించారు. సమీక్ష సమావేశంలో నగర పాలక సంస్థ కమిషనర్ ఎం మకరంద్, ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్, వ్యవసాయ, వైద్యారోగ్య, రెవెన్యూ, ఇరిగేషన్, ట్రాన్స్ కో, మున్సిపల్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఉత్తమ అధ్యాపకుడి అవార్డు అందుకుంటున్న తెయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి

ప్రతిభకు పట్టం కట్టారు..

మోపాల్/బాల్కొండ : తెయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపక అవార్డును మంగళవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన గురు పూజోత్సవ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మహమూద్ అలీ, విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. రూ. 10 వేల నగదు బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను తెయూ ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్, పరీక్షల నియంత్రణ అధికారిణి అరుణ, యూజీసీ డైరెక్టర్ ఆంజనేయులు, కళాశాల ప్రిన్సిపాల్ హారతి తదితరులు అభినందించారు. బాల్కొండ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోషల్ టీచర్ వేల్పూర్ శ్రీనివాస్ మంగళవారం హైదరాబాద్‌లో అవార్డు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యా మండలి చైర్మన్ లింబాద్రి, ఎమ్మెల్సీలు సురభివాని, కూర రఘూత్తం రెడ్డి తదితరులు పాల్గొన్నారు. నిజామాబాద్ రూరల్ మండలంలోని గుండారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు పండిత్‌గా పనిచేస్తున్న కాసర్ల నరేశ్ రావు హైదరాబాద్‌లో అవార్డు అందుకున్నారు.

అవార్డులు అందుకుంటున్న కాసర్ల నరేశ్ రావు, వేల్పూర్ శ్రీనివాస్, లింగన్న, అంబర్‌సింగ్

సమసమాజ స్థాపనకు కృషి చేయాలి



ఉత్తమ అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులతో మంత్రి ప్రశాంత్ రెడ్డి, జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు, టీఎస్‌డబ్ల్యూఎఫ్‌సీ చైర్‌పర్సన్ ఆకుల లలిత, కలెక్టర్

- విలువైన విద్యావిజ్ఞానం అందించాలి
- టీచర్లకు త్వరలోనే మరో పీఆర్సీ
- మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి
- జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

నిజామాబాద్ అర్బన్ : ఉపాధ్యాయ వృత్తికి మించిన వృత్తి సమాజంలో మరేదీ లేదని, విద్యార్థులకు నాణ్యమైన విద్య, విజ్ఞానాన్ని అందించి సమసమాజ స్థాపనకు దోహదపడాలని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో గురు పూజోత్సవ కార్యక్రమం నిర్వహించారు. డీఈవో దుర్గాప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంతో మంత్రి ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలతో పోలిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో బోధించే విద్యార్థులు ఎంతో అనుభవమున్నవారన్నారు. ఈ సందర్భంగానే సీఎం కేసీఆర్ మన ఊరు–మన బడి కార్యక్రమం నిర్వహిస్తూ రూ. కోట్లల్లో నిధులు వెచ్చిస్తున్నారన్నారు. జిల్లాలోని సుమారు 150 వరకు ప్రభుత్వ పాఠశాలలకు డిజిటల్ తరగతి గదులు సమకూరాయన్నారు. ఈ సందర్భంగా తన విద్యార్థి దశలో ప్రేరణగా నిలిచిన గురువులు మోహన్ రెడ్డి, అనంత రాములు, గంగాధర్ గౌడ్ తదితర ఉపాధ్యాయుల కృషిని గుర్తు చేసుకున్నారు. ఉపాధ్యాయుల కోసం సీఎం కేసీఆర్ ఇంకో అడుగు ముందు కేస్తూ, మరో పీఆర్సీ ఇవ్వబోతున్నారన్నారు. ఈ మేరకు త్వరలోనే పీఆర్సీ ప్రకటన చేస్తారని మంత్రి భరోసా కల్పించారు. తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించిన ఉపాధ్యాయుల సమస్యలపైనా సీఎంకు సానుకూలంగా స్పందిస్తారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 11వేల మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు, 50వేల మందికి బదిలీలు జరుగానున్నాయన్నారు. జెడ్పీ చైర్మన్ విఠల్ రావు మాట్లాడుతూ గురువు ప్రోద్బలంతోనే ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దబడతారన్నారు. ఉపాధ్యాయులు నిబద్ధతతో అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు వస్తుందన్నారు. మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా స్థాయిలో ఉత్తమ టీచర్లుగా ఎంపికైన 30 మంది ఉపాధ్యాయులను జ్ఞాపికలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఆకుల లలిత, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, యాదిరెడ్డి, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్‌గౌడ్, విద్యాశాఖ అధికారులు వనిత, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మకానికి వైన్స్ లైసెన్స్‌లు

- జిల్లాలో లాటరీ ద్వారా 102 వైన్స్‌ల ఎంపిక
- ఇప్పటికే 50 మద్యం దుకాణాలు అమ్మకానికి సిద్ధం..!
- రూ. 50 లక్షల నుంచి రూ. 1.50 కోట్ల వరకు డిమాండ్

■ జిల్లా కేంద్రంలోని ఆర్మూర్ రోడ్డులో ఉన్న ఒక వైన్ షాప్‌ను లక్కీ డ్రాలో గెలుపొందిన వ్యక్తికి రూ. 1.50 కోట్ల ఆఫర్ వచ్చింది. దీంతో వైన్స్ లైసెన్స్‌దారుడు ఆఫర్‌కు ఓకే చెప్పి వైన్స్‌ను సదరు ఆఫర్ ఇచ్చిన వ్యక్తికి ఇచ్చేశాడు.

■ ఎడపల్లి మండలంలోని ఒక వైన్స్‌కు రూ. 80 లక్షలు ఇచ్చేందుకు ఓ ఔత్సాహికుడు ముందుకు రాగా మధ్యవర్తులతో చర్చలు జరిగాయి. అయినప్పటికీ సదరు వైన్స్ హక్కుదారుడు దుకాణాన్ని ఇచ్చేందుకు ఒప్పుకోలేదు.

■ జక్రాన్‌పల్లి మండలంలోని ఓ వైన్స్‌ను ఇటీవల జరిగిన లక్కీడ్రాలో ఓ వ్యక్తి గెలుచుకోగా రూ. 80 లక్షల ఆఫర్ రావడంతో అమ్మేసినట్లు సమాచారం.

ఖలీల్‌వాడి : రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త మద్యం పాలసీ ప్రకారం జిల్లాలోని 102 వైన్స్ షాప్‌లకు దరఖాస్తులు ఆహ్వానించి, వారికి లక్కీడ్రా ద్వారా ఎంపిక చేశారు. 2021–2023కు గాను వైన్స్ షాప్‌ల గడువు నవంబర్ 31 వరకు ఉంది. డిసెంబర్ 1 నుంచి కొత్త వైన్స్‌షాపులు ప్రారంభమవుతాయి. జిల్లాలో ఎస్సీలకు 11, ఎస్టీలకు 2, గౌడ కులస్తులకు 11, ఓపెన్‌లో 78 వైన్స్‌లు ఉన్నాయి. వైన్ దుకాణాల లైసెన్స్‌లు లాటరీలో వచ్చిన వారు ఆగస్టు 22న మొదటి ఇన్‌స్టాల్‌మెంట్ చెల్లించారు. వైన్స్‌లకు మద్యంను నవంబర్ 30న అందిస్తామని, డిసెంబర్ 1 నుంచి షాపులను లైసెన్స్ పొందినవారు ప్రారంభించాల్సి ఉంటుంది. అయితే కొత్త వైన్స్ దుకాణాలు అమ్మకాలు జరిపేందుకు మూడు నెలల సమయం ఉండటంతో వైన్స్ దుకాణాల లైసెన్స్‌లు పొందిన వారు అమ్మకానికి పెడుతున్నారు. ఈ లైసెన్స్ పరిధిలోనే ఎన్నికలు రానున్న దృష్ట్యా ఖచ్చితంగా తాము లాభపడతామని ఊహిస్తున్న కొందరు మద్యం వ్యాపారులు లైసెన్స్ హక్కుదారులను మచ్చిక చేసుకుంటున్నారు. భారీ డబ్బు ఆఫర్లు ఇస్తున్నారు. దీంతో జిల్లాలో 102 వైన్స్‌లలో ఇప్పటి వరకు 30 వరకు లైసెన్స్ హక్కుదారులకు మద్యం వ్యాపారుల మధ్య ఒప్పందాలు కుదిరినట్లు తెలుస్తోంది. మరిన్ని పెరిగే అవకాశాలు ఉన్నాయని సమాచారం.

బడాబాబుల చేతుల్లోకి లిక్కర్ వ్యాపారం

వైన్స్‌లను బట్టి అక్కడ ఆదాయం వచ్చే ప్రకారం మద్యం వ్యాపారులు ధరలను నిర్ణయిస్తున్నారు. వైన్స్ లైసెన్స్ రెండేళ్ల పాటు ఉంటుంది. ఈ రెండేళ్ల కాలంలో వచ్చే ఆదాయాన్ని ఒకేసారి ఇవ్వడానికి ఒప్పందాలు చేసుకుంటున్నారు. రూ. 50 లక్షల నుంచి రూ. 1.50 కోట్లు చెల్లించడానికి మద్యం వ్యాపారులు సిద్ధమయ్యారు. ఇప్పటివరకు 30 వైన్స్‌లు ఒప్పందాలు కుదరగా మరో 20 వైన్స్‌లకు లైసెన్స్ దారులతో చర్చలు జరుగుతున్నట్లు తెలిసింది. దీంతో లిక్కర్ వ్యాపారం బడాబాబుల చేతుల్లోకి వెళ్లిపోతోందనే చర్చ కొనసాగుతుంది.

ఊరిస్తోన్న ఎన్నికలు..

చాలా మంది లిక్కర్ వ్యాపారులు వైన్స్‌కు టెండర్లు వేసిన లక్కీ డ్రాలో రాకపోవడంతో లైసెన్స్‌లు కోనుగోలుకు సిద్ధమయ్యారు. శాసనసభ ఎన్నికలు సమీపంచడంతో వైన్స్‌లకు గిరాకీ పెరుగుతుందని లిక్కర్ వ్యాపారులు భావిస్తున్నారు. వీటి తర్వాత ఎంపీ, సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు వరుసగా ఉండటంతో వీటి ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చునని బేరసారాలకు తెరలేపుతున్నారు. దీంతో లైసెన్స్‌లు అమ్మకాలు జోరు అందుకున్నాయి. వైన్స్‌లు ప్రారంభమవడానికి ఇంకా మూడు నెలల సమయం ఉండటంతో అప్పటికీ వరకు చాలా మంది లైసెన్స్ హక్కుదారులు తమ లైసెన్స్‌లను అమ్మేస్తారని ప్రచారం నడుస్తోంది.

క్లుప్తంగా

అమ్మో చిరుత..!



బాల్కొండ: మెండోరా మండలం సావెల్‌ గ్రామంలో చిరుత సంచరిస్తోందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని పెద్దవాగు వైపు ఉన్న పంట పొలాల్లో చిరుత కాలి ముద్రలు కనిపించినట్లు రైతులు తెలిపారు. గతేడాది వెల్కటూర్‌ శివారులోని గుండె వాగు పరిసర ప్రాంతాల్లో చిరుత సంచరించినట్లు పేర్కొన్నారు. ఈ విషయమై మెండోరా సెక్షన్‌ అధికారి గణేశ్‌ స్పందిస్తూ ఇవి చిరుత కాలి ముద్రలు కావని వాటి ముద్రల్లో గోర్లు కనిపించవని తెలిపారు. చిరుత పాదముద్రలు కనీసం 15 సెంటీమీటర్ల పొడవు ఉంటుందన్నారు. గ్రామస్తులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

సమ్మెను జయప్రదం చేయండి

ఖలీల్‌వాడి: పారిశుధ్య డ్రైవర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్‌ చేస్తూ ఈ నెల 11 నుంచి సమ్మె చేపడుతున్నట్లు తెలంగాణ మున్సిపల్‌ వర్కర్స్‌ అండ్‌ ఎంప్లాయీస్‌ యూనియన్‌ రాష్ట్ర కార్యదర్శి గోవర్ధన్‌, డ్రైవర్లు తెలిపారు. ఈ సందర్భంగా సమ్మె నోటీసును మున్సిపల్‌ కమిషనర్‌ సీసీకి మంగళవారం వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం పారిశుధ్య కార్మికులకు మేడే కానుకగా పెంచిన రూ.వెయ్యి వేతనాన్ని రెండు నెలలు చెల్లించి, తిరిగి రికవరీ చేయడం తగదన్నారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ్‌, వెంకటేశ్‌, మహేశ్‌, అశోక్‌ తదితరులు పాల్గొన్నారు.

వేల్పూర్‌లో ఫ్లెక్సీ రగడ



వేల్పూర్‌ : బీఆర్‌ఎస్‌ను సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని బీజేపీ రాష్ట్ర నాయకుడు ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి విమర్శించారు. వేల్పూర్‌ క్రాస్‌రోడ్డు వద్ద బీజేపీ ఫ్లెక్సీని బీఆర్‌ఎస్‌ నాయకులు పెట్టనివ్వకుండా అడ్డుకోవడంపై వేల్పూర్‌ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం స్టేషన్‌ ఎదుట ఆందోళనకు దిగారు. రోడ్డుపై బైఠాయించారు. పడగల్‌ శివారులోని వేల్పూర్‌ క్రాస్‌రోడ్‌ వద్ద బీజేపీ ఫ్లెక్సీని ఏర్పాటు చేసేందుకు సిద్ధమవ్వగా బీఆర్‌ఎస్‌ నాయకులు అడ్డుకున్నారని, తిరిగి తమపైనే ఫిర్యాదు చేశారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై ఎస్సై వినయ్‌కుమార్‌ను ప్రశ్నించగా ఆయన దురుసుగా వ్యవహరించారన్నారు. బాల్కొండలో ప్రశాంత్‌ రెడ్డి అక్రమాలకు మరో రెండు నెలల సమయం మాత్రమే ఉందని మల్లిఖార్జున్‌ రెడ్డి పేర్కొన్నారు. ఆయనతోపాటు ఇతర బీజేపీ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు.

బీజేపీ జిల్లా స్వచ్ఛభారత్‌ చైర్మన్‌గా వీరేశం



నందిపేట్‌ (ఆర్మూర్‌): బీజేపీ జిల్లా స్వచ్ఛభారత్‌ కమిటీ చైర్మన్‌గా మండల కేంద్రానికి చెందిన పార్టీ నాయకుడు వీరేశం నియామకమయ్యారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య నియామకపత్రాన్ని మంగళవారం అందజేశారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన ఎంపీ ధర్మపురి అరవింద్‌, రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మారంపల్లి గంగాధర్‌, సురేందర్‌, భూతం సాయిరెడ్డి పాల్గొన్నారు.

విలీనం కోసం వినతులు..

- భర్తీకి నోచుకోని 616 ఐఈడీఎస్‌ఎస్‌ పోస్టులు
- స్పెషల్‌ టీచర్ల నియామకానికి పచ్చ జెండా ఊపిన రాష్ట్ర ప్రభుత్వం



ఐఈఆర్పీలను విద్యాశాఖలో విలీనం చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ మంత్రి కేటీఆర్‌ రాసిన లేఖ



మంత్రి ప్రశాంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న స్పెషల్‌ టీచర్లు (ఫైల్‌)

ఆర్మూర్‌: ఉమ్మడి రాష్ట్రంలో నాటి ప్రభుత్వం ఐఈడీ స్కీం పరిధిలో విధులు నిర్వహిస్తున్న 47 మంది స్పెషల్‌ టీచర్లను (ఇన్‌క్లూసివ్‌ ఎడ్యుకేషన్‌ రిసోర్స్‌ పర్సన్లను) 2003లో 118 జీవో ఆధారంగా విద్యాశాఖలో విలీనం చేసి ఎస్జీటీలుగా క్రమబద్ధీకరించింది. ఇదే తరహాలో తమనూ విద్యాశాఖలో విలీనం చేయాలని కోరుతూ ఐఈఆర్పీలు రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవిస్తున్నారు. విద్యాహక్కు చట్టం అమలులో భాగంగా దివ్యాంగులకు విద్యాబోధన అనే అంశం మొదటి నుంచి నిరాదరణకు గురవుతూనే ఉంది. తాజాగా సుప్రీం కోర్టు ఆదేశాలతో రాష్ట్ర చరిత్రలో మొదటిసారిగా స్పెషల్‌ టీచర్ల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. 1,523 స్పెషల్‌ టీచర్ల నియామకానికి ఫైనాన్షియల్‌ క్లియరెన్స్‌ తీసుకొని జీవో నంబర్‌ 97 ఆధారంగా నోటిఫికేషన్‌ విడుదల చేయడానికి ఏర్పాట్లు చేస్తోంది. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న సమగ్ర శిక్ష సహిత విద్యా విభాగం ఆధ్వర్యంలో 20 సంవత్సరాలుగా దివ్యాంగులకు విద్యా బోధన చేస్తూ కాంట్రాక్టు పద్ధతిపై చాలీ చాలని వేతనాలతో 1,005 మంది ఐఈఆర్పీలు విధులు నిర్వహిస్తున్నారు. తమ సర్వీసులను విద్యాశాఖలో పర్మినెంట్‌ చేయాలని కోరుతూ సీఎం కేసీఆర్‌తో పాటు మంత్రులు, రాష్ట్ర స్థాయి అధికారులను కోరుతున్నారు. ఐఈఆర్పీలను విలీనం చేయాలంటూ మంత్రి కేటీఆర్‌ సైతం రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశారు.

ఐఈడీఎస్‌ఎస్‌ నియామకాల్లో మొండి చేయి

ఉన్నత పాఠశాలలో దివ్యాంగులకు బోధించేందుకు 2012లో జీవో నంబర్‌ 341 ఆధారంగా 1,476 ఐఈడీఎస్‌ఎస్‌ (ఇన్‌క్లూసివ్‌ ఎడ్యుకేషన్‌ ఫర్‌ డిసేబుల్‌ ఎట్‌ సెకండరీ స్టేజ్‌) పోస్టులను భర్తీ చేయాలని కేంద్ర ప్రభుత్వం అనుమతించి నిధులను సైతం విడుదల చేసింది. కానీ ఉమ్మడి రాష్ట్రంలో ఈ నియామకపు ప్రక్రియ ముందుకు సాగలేదు. రాష్ట్ర విభజన అనంతరం 2014లో నాటి ఆంధ్రప్రదేశ్‌ ప్రభుత్వం తమ రాష్ట్రానికి కేటాయించిన 860 ఐఈడీఎస్‌ఎస్‌ పోస్టులను 7 ఏప్రిల్‌ 2015 జీవో నంబర్‌ 39 ఆధారంగా ఐఈఆర్పీలకు వెయిటేజీ ఇచ్చి భర్తీ చేసింది. తెలంగాణ రాష్ట్రానికి 616 ఐఈడీఎస్‌ఎస్‌ పోస్టులను కేటాయించారు. కానీ ఇక్కడ ఈ పోస్టులు నేటికీ భర్తీకి నోచుకోవడం లేదు.

జిల్లాకు 69 పోస్టులు మంజూరు..

స్పెషల్‌ టీచర్ల భర్తీలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా మంజూరు చేసిన 1,523 పోస్టుల్లో జిల్లాకు 69 పోస్టులను కేటాయించారు. వీటిలో 38 స్కూల్‌ అసిస్టెంట్‌, 31 ఎస్జీటీ పోస్టులను కేటాయించారు.

విద్యాశాఖలో విలీనం చేయాలి

సమగ్ర శిక్ష సహిత విద్యావిభాగం ఆధ్వర్యంలో దివ్యాంగులకు విద్యా బోధన చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులైన ఐఈఆర్పీలను విద్యా శాఖలో విలీనం చేయాలి. మేము కూడా తెలంగాణ బిడ్డలమే మా సర్వీసులను గుర్తించి సీఎం కేసీఆర్‌ మానవతా దృక్పథంతో క్రమబద్ధీకరించాలి. – చెలివేరి వెంకటేశ్‌, రాష్ట్ర అధ్యక్షుడు, తెలంగాణ ఇన్‌క్లూసివ్‌ ఎడ్యుకేషన్‌ రిసోర్స్‌ టీచర్స్‌ అసోసియేషన్‌

ప్రమాదకరంగా వంతెనలు

- పట్టించుకోని అధికారులు



సుల్తాన్‌నగర్‌ శివారులో ప్రమాదకరంగా ఉన్న ప్రధాన కాలువ వంతెన

నిజాంసాగర్‌(జుక్కల్‌): చివరి ఆయకట్టు వరకు సాగు నీరందిస్తున్న నిజాంసాగర్‌ ప్రాజెక్టు ప్రధాన కాలువ వంతెనలు ప్రమాదకరంగా మారాయి. ప్రాజెక్టు నిర్మాణ సమయంలో కట్టినవి కావడంతో ప్రస్తుతం అవి శిథిలావస్థకు చేరాయి. ప్రధాన కాలువ వంతెనలకు ఇరువైపులా ఉన్న బండరాళ్లు సైతం ఊడిపోయి ప్రమాదభరితంగా మారాయి.

ఉమ్మడి జిల్లాలో..

ఉమ్మడి జిల్లాలో 75 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న నిజాంసాగర్‌ ప్రధాన కాలువపై పలుచోట్ల ఉన్న ప్రధాన కాలువ వంతెనలు ప్రమాదాలకు నిలయంగా మారాయి. సుల్తాన్‌నగర్‌, గున్కుల్‌, బూర్గుల్‌, కొమలంచ, గాలీపూర్‌, సింగీతం, దక్కల్‌దాని తండా, నస్రుల్లాబాద్‌ ప్రాంతాల్లో ప్రధాన రహదారులపై ఉన్న వంతెనలు ప్రమాదభరితంగా మారాయి. నిజాంసాగర్‌– బొగ్గుగుడిసె ప్రధాన రోడ్డు మార్గంలో సుల్తాన్‌నగర్‌ శివారులో ఉన్న ప్రధాన కాలువ వంతెనకు బండరాళ్లు ఊడిపడ్డాయి. గున్కుల్‌ శివారులోని ప్రధాన కాలువ వంతెనకు రెండు వైపులా బండరాళ్లు ఊడిపోవడవంతో వాహన చోదుకులు, పాదాచారులకు ప్రమాదం పొంచి ఉంది. బూర్గుల్‌, కొమలంచ గ్రామ శివార్లలో ఉన్న ప్రధాన కాలువ వంతెనలకు రెండు వైపులా ఉన్న అడ్డుగోడలు కూలిపోవడంతో పశువులు ప్రధాన కాలువలో పడి ప్రాణాలు కోల్పోతున్నాయి. గాలీపూర్‌ శివారులో ప్రధాన కాలువ వంతెనపై తరుచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. సదరు వంతెన బండరాళ్లు ఊడిపోవడంతో వాహనాలు ప్రధాన కాలువలో పడి ప్రయాణికులు గల్లంతవడంతో ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయి.

వంతెనలకు మరమ్మతులు కరువు

నిజాంసాగర్‌ ప్రధాన కాలువ సిమెంట్‌ లైనింగ్‌ పనులకు నాటి దివంగత ముఖ్యమంత్రి డాక్టర్‌ వైఎస్‌ రాజశేఖర్‌రెడ్డి రూ. 450 కోట్లు మంజూరు చేశారు. దాంతో ఉమ్మడి జిల్లాలోని చివరి ఆయకట్టు వరకు ఉన్న ప్రధాన కాలువకు సిమెంట్‌ లైనింగ్‌ పనులు చేపట్టారు. కానీ ప్రధాన కాలువపై ఉన్న వంతెనలను నీటిపారుదల శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో మరమ్మతులకు నోచుకోలేదు. దాంతో ప్రధాన కాలువ వంతెనలు ప్రయాణికులకు, వాహన చోదకుల ప్రాణాలకు సంకటంగా మారాయి. వంతెనలకు మరమ్మతులు చేపట్టి, ప్రమాదాలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహన చోదకులు అధికారులను కోరుతున్నారు. నీటిపారుదల, ఆర్‌అండ్‌బీ శాఖల అధికారులు ఇకనైనా స్పందించి ప్రధాన కాలువ వంతెనలకు మరమ్మతు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రెండ్రోజుల్లో 50.7 మి.మీటర్ల వర్షం

సుభాష్‌నగర్‌: జిల్లా వ్యాప్తంగా గడిచిన 24 గంటల్లో 50.7 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా మోపాల్‌ మండలంలో 90.3 మిల్లీమీటర్లు, జక్రాన్‌పల్లిలో 81.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు, చెరువుల అలుగులు పొంగిపొర్లుతున్నాయి.

29 మండలాల్లో అత్యధికం, 4 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. రాగల రెండ్రోజులు కూడా జిల్లాలో మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

వర్షపాతం వివరాలు(మి.మీ.)

వేల్పూర్‌	57.7	రెంజల్‌	45.9	ముప్కాల్‌	35.4
జక్రాన్‌పల్లి	81.4	నందిపేట్‌	31.3	బోధన్‌	35.9
నవీపేట్‌	45.9	కోటగిరి	41.5	సాలూర	36.8
భీమ్‌గల్‌	56.0	డొంకేశ్వర్‌	49.0	ఎడపల్లి	37.3
మోర్తాడ్‌	39.0	ఇందల్వాయి	74.2	మోపాల్‌	90.3
కమ్మర్‌పల్లి	51.7	మెండోరా	34.9	నిజామాబాద్‌ రూరల్‌	58.2
సిరికొండ	55.6	మాక్లూర్‌	43.8	చందూర్‌	31.5
బాల్కొండ	63.4	పోతంగల్‌	52.0	రుద్రూర్‌	42.7
ఆలూరు	56.8	వర్ని	42.2	నిజామాబాద్‌ నార్త్‌	47.7
డిచ్‌పల్లి	76.0	ధర్పల్లి	68.0	మోస్రా	35.3
ఏర్గట్ల	56.3	ఆర్మూర్‌	61.6	నిజామాబాద్‌ సౌత్‌	37.8

ట్రస్ట్‌ భూములపై విచారణ చేపట్టాలి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

నిజామాబాద్‌అర్బన్‌: ఆర్యవైశ్య జూనియర్‌ కళాశాల ఏర్పాటుకు బోర్గాం (పి) వద్ద ఉన్న 4 ఎకరాల 22 గుంటల భూములపై విచారణ చేపట్టాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్‌ డిమాండ్‌ చేశారు. ఇంటర్‌ విద్యాధికారి రఘురాజ్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఆర్యవైశ్య జూనియర్‌ కళాశాలకు 1994లో నాటి సీఎం కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి శంకుస్థాపన చేశారని, నాటి నుంచి నేటి వరకు కళాశాల నిర్మించలేదన్నారు. కళాశాల నిర్మాణానికి ఏర్పాటు చేసిన ట్రస్ట్‌ భూములు కొంత మంది కబ్జా చేశారని వాటిని కాపాడాలని డిమాండ్‌ చేశారు. అదేవిధంగా రాష్ట్రంలోని అన్ని జూనియర్‌ కళాశాలల్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి దేవిక, కోశాధికారి పవన్‌, నాయకులు సునీల్‌, నిఖిల్‌, నాయకులు రంజిత్‌, హన్మాండ్లు, రాజు తదితరులు పాల్గొన్నారు.

‘ప్రయాస’కు ప్రతిపాదనలు పంపండి

నిజామాబాద్‌ అర్బన్‌ : విద్యార్థుల పరిశోధనలకు వేదికైనటువంటి ‘ప్రయాస’ కార్యక్రమానికి ఆయా పాఠశాలల విద్యార్థుల నుంచి ప్రతిపాదనలు పంపాలని డీఈవో దుర్గాప్రసాద్‌ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 20వ తేదీ వరకు ప్రతిపాదనలు పంపేందుకు అవకాశం ఉందన్నారు. స్థానికంగా ఉన్న సమస్యను ఎన్నుకొని ఆ సమస్యకు శాస్త్రీయ కోణంతో పరిశోధించి పరిష్కారం వెతకాలన్నారు. 14 నుండి 18ఏళ్ల గల వారు 9, 10, 11 తరగతుల వారు అర్హులన్నారు. ఎంపికైన మొదటి ప్రతిపాదనకు రూ. 50 వేల బహుమతి ఇస్తామన్నారు. వివరాలకు 9848219365లో సంప్రదించాలన్నారు.

విద్యాశాఖలో విలీనం చేయాలి



నినాదాలు చేస్తున్న నాయకులు

కామారెడ్డి టౌన్‌: సమగ్ర శిక్ష ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేయాలని కోరుతూ చేపట్టిన ఉద్యోగుల సమ్మె మంగళవారం 9వ రోజుకు చేరింది. నగరంలోని మున్సిపల్‌ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న దీక్షా శిబిరంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి, సావిత్రిబాయి పూలే విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తూ 18 సంవత్సరాల కాంట్రాక్ట్‌ వ్యవస్థలో దోపిడీకి గురవుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దీక్షకు టీపీటీఎఫ్‌ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, ఆయా సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగుల సంఘం జేఏసీ అధ్యక్షుడు దామోదర్‌, జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, జిల్లా కోశాధికారి భాను, ఉపాధ్యక్షులు వీణ, శైలజ, సంతోష్‌రెడ్డి, సంపత్‌, ఆర్గనైజ్‌ సెక్రటరీ రాములు, మాధవి, నాయకుడు కాళిదాస్‌, ఉద్యోగులు పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల ఇరువురి అదృశ్యం

కామారెడ్డి క్రైం: సదాశివనగర్‌ మండలం కల్వరాల్‌ గ్రామానికి చెందిన లక్ష్మి అనే యువతి అదృశ్యమైనట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో నరేశ్‌ మంగళవారం తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఓ సూపర్‌ మార్కెట్‌లో పనిచేస్తున్న లక్ష్మి ఈ నెల 4న కామారెడ్డికి వచ్చి తిరిగి ఇంటికి రాలేదని కుటుంబీకులు చెప్పారు. తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

అడ్లూరు ఎల్లారెడ్డికి చెందిన యువకుడు..

సదాశివనగర్‌ మండలం అడ్లూరు ఎల్లారెడ్డి గ్రామానికి చెందిన మహమ్మద్‌ అతిక్‌ అనే వ్యక్తి అదృశ్యమైనట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో నరేశ్‌ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పీఎంహెచ్‌ కాలనీలో అతిక్‌ బాబాయ్‌ సాదిక్‌ కొద్దిరోజులుగా ఇంటి మరమ్మతు పనులు చేయిస్తున్నాడు.

పనులు చూసుకునేందుకు ఈనెల 4న కాలనీకి వచ్చిన అతిక్‌ ఇంటికి తిరిగి వెళ్లలేదు. పలు చోట్ల గాలించినా ఆచూకీ దొరకలేదు. దీంతో అతని బాబాయ్‌ సాదిక్‌ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

కృషి విజ్ఞాన కేంద్రం కో–ఆర్డినేటర్‌గా అంజయ్య



రుద్రూర్‌: రుద్రూర్‌ కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో–ఆర్డినేటర్‌గా డాక్టర్‌ అంజయ్య మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు కో–ఆర్డినేటర్‌గా ఉన్న నవీన్‌కుమార్‌ కొత్తగూడెంకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ.. కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా రైతులకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తానని అన్నారు. అనంతరం నూతన కో–ఆర్డినేటర్‌కు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

చెక్‌పోస్ట్‌ ఏర్పాటుకు పరిశీలన

సిరికొండ: రానున్న ఎన్నికల దృష్ట్యా జిల్లా సరిహద్దులో చెక్‌ పోస్టు ఏర్పాటుకు పలు ప్రాంతాలను పరిశీలించినట్లు సీఐ సైదా మంగళవారం తెలిపారు. మండలంలోని తాటిపల్లి, చీమన్‌పల్లి, జిల్లాకు ఆనుకొని ఉన్న రాజన్నసిరిసిల్ల జిల్లా సరిహద్దు గ్రామాలైన మర్రిమడ్ల, శాంతినగర్‌ ప్రాంతాలను పరిశీలించినట్లు పేర్కొన్నారు. ఎస్సై రమేశ్‌, సిబ్బంది ఉన్నారు.

పాలిటెక్నిక్‌లో ధ్రువపత్రాల పరిశీలన

నిజామాబాద్‌అర్బన్‌: పాలిటెక్నిక్‌ కళాశాలలో ఎంసెట్‌, బైపీసీ విభాగాల్లో ప్రవేశాల ప్రక్రియకు కౌన్సెలింగ్‌ కొనసాగుతోంది. స్లాట్‌ బుక్‌ చేసుకున్న 560 మంది విద్యార్థులకు ధ్రువపత్రాల పరిశీలన చేసినట్లు కౌన్సిలింగ్‌ కన్వీనర్‌ శ్రీరామ్‌కుమార్‌ మంగళవారం తెలిపారు. ధ్రువపత్రాల పరిశీలన పూర్తయిన విద్యార్థులు ఈనెల 7వ తేదీ వరకు కళాశాలల ఎంపికకు అవకాశం ఉంటుందని అన్నారు.

పేకాట స్థావరంపై దాడి

ఖలీల్‌వాడి: ఆర్మూర్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని మామిడిపల్లిలో పేకాట కేంద్రంపై టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు మంగళవారం రాత్రి దాడి చేశారు. పేకాటాడుతున్న 12 మంది నుంచి రూ. 90,720తో పాటు 12 సెల్‌ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఆర్మూర్‌ ఎస్సైకి అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్‌ సీఐ అజయ్‌ బాబు తెలిపారు.

మట్కా ఆడుతున్న ఇద్దరి అరెస్ట్‌

ఖలీల్‌వాడి : నగరంలోని ఒకటో టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని మట్కా ఆడుతున్న ఇద్దరిని అరెస్ట్‌ చేసినట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు మంగళవారం తెలిపారు. నిందితుల నుంచి రూ.1250 స్వాధీనం చేసుకొని సెల్‌ఫోన్‌, ఆటోను సీజ్‌ చేసినట్లు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎన్‌హెచ్‌ఎంల సర్వీసును క్రమబద్ధీకరించాలి



నినాదాలు చేస్తున్న నాయకులు, ఉద్యోగులు

కామారెడ్డి టౌన్‌: నేషనల్‌ హెల్త్‌ మిషన్‌(ఎన్‌హెచ్‌ఎం) పథకంలో విధులు నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల సర్వీసులను రెగ్యులరైజ్‌ చేయాలని ఉద్యోగులు డిమాండ్‌ చేశారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్‌ విగ్రహం ఎదుట ప్లకార్డులతో మంగళవారం నిరసన తెలిపారు. అనంతరం అంబేద్కర్‌ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఎన్‌హెచ్‌ఎంలో విధులు నిర్వహిస్తున్న డీఈవోలు, ఎల్‌టీలు, స్టాఫ్‌నర్సులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, పీఎఫ్‌, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు పి. బాలరాజ్‌, మెడికల్‌ ఎంప్లాయిస్‌ వర్కర్స్‌ యూనియన్‌ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్‌. దశరథ్‌, బాలకృష్ణ, రాజు, సిద్ధార్థగౌడ్‌, అనిల్‌ గౌడ్‌, స్వాతి, గీత, దివ్య, వెంకటరమణ, హరినాథ్‌, సంధ్య, ప్రియాంక, వాసు తదితరులు పాల్గొన్నారు.

డీఈవోకు సమ్మె నోటీసు అందజేత



నోటీసు అందజేస్తున్న నాయకులు

నిజామాబాద్‌అర్బన్‌: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌ చేస్తూ ఈ నెల 20 నుంచి సమ్మె చేపడుతున్నట్లు యూనియన్‌ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సాయమ్మ, చక్రపాణి తెలిపారు. ఈ సందర్భంగా సమ్మె నోటీసును డీఈవో దుర్గాప్రసాద్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. రెండేళ్ల క్రితం రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేస్తే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి రూ. 3 వేల వేతనాన్ని చెల్లిస్తామని హామీ ఇచ్చింది. కానీ నేటి వరకు వాటిని చెల్లించలేదని, అంతేకాకుండా రావాల్సిన బకాయి బిల్లులు చెల్లించలేదన్నారు. సమ్మెను కార్మికులు విజయవంతం చేయాలని కోరారు.

యువత ఓటు నమోదు చేసుకోవాలి



విజేతలను సన్మానిస్తున్న ఆర్డీవో

ఆర్మూర్‌టౌన్‌: ఓటు హక్కు కోసం 18 సంవత్సరాలు నిండిన యువత నమోదు చేసుకోవాలని ఆర్డీవో వినోద్‌కుమార్‌ అన్నారు. ఆర్మూర్‌ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఓటరు నమోదుపై మంగళవారం అవగాహన కల్పించారు. ఎన్‌వీఎస్‌పీ, ఓటర్‌ హెల్ప్‌లైన్‌ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కును అర్హులైన ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. అనంతరం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్‌ శ్రీకాంత్‌, నాయబ్‌ తహసీల్దార్‌ విజయ్‌కాంత్‌రావు, ఆర్‌ఐ అశోక్‌, ప్రిన్సిపాల్‌ వేణుగోపాలస్వామి, రాజేశ్‌, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్‌

చిరుత దాడిలో మేక మృతి

నవీపేట: చిరుత దాడిలో మేక మృతి చెందిన ఘటన మండలంలోని అల్జాపూర్‌ శివారులో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన దేవన్న మేక రెండు రోజుల క్రితం కనిపించకపోవడంతో గ్రామస్తులు మంగళవారం గుంపుగా అటవీ ప్రాంతంలో వెతికారు. మేక కళేబరం లభించడంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. గతంలో ఇదే ప్రాంతంలో చిరుత సంచరించిందని ఈ విషయమై అటవీ శాఖ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నత అధికారులు స్పందించి గ్రామస్తుల ప్రాణాలను కాపాడాలని వారు కోరారు.

వరద ఉధృతికి రెండు పశువులు మృతి



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పెద్దవాగులో రెండు పశువులు వరద ఉధృతికి కొట్టుకుపోయి మృతి చెందినట్లు స్థానికులు మంగళవారం తెలిపారు. బోనాల తండాకు చెందిన బానోత్‌ బలరాం పాడి గేదె, నల్లమడుగుతండాకు చెందిన సరిచంద్‌ ఆవు మేతకు వెళ్లి పెద్దవాగు వరద ఉధృతికి కొట్టుకుపోయి మృతిచెందినట్లు బాధితులు తెలిపారు. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం అందించాలని కోరుతున్నారు.

బిడ్డను అమ్మకానికి పెట్టిన నలుగురు అరెస్ట్‌

- ఏసీపీ కిరణ్‌కుమార్‌



మాట్లాడుతున్న ఏసీపీ కిరణ్‌కుమార్‌

ఖలీల్‌వాడి: అప్పుడే పుట్టిన బిడ్డను అమ్మకానికి పెట్టిన ఘటనలో నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ కిరణ్‌కుమార్‌ తెలిపారు. ఏసీపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నగరంలోని అంబేద్కర్‌ కాలనీకి చెందిన గోసంగి దేవీ ఈ నెల 3న మగబిడ్డకు జన్మనిచ్చింది. పోషించేస్థాయి లేనందున ఆశావర్కర్‌ జయ సహకారంతో బిడ్డను విక్రయించేందుకు సిద్ధమైంది. అదే ప్రాంతానికి చెందిన హుమేరా బేగం, షబానా బేగంలు మగబిడ్డ పుడితే రూ. లక్ష, ఆడబిడ్డ పుడితే రూ. 1.50లక్షలు ఇస్తామని దేవీతో ఒప్పందం చేసుకున్నారు. ముందుగా ఒకరికి తెలియకుండా మరొకరు రూ. ఐదు వేలు చొప్పున దేవీకి ఇచ్చారు. ఈ నెల 3న నగరంలోని ఓ ప్రైవేట్‌ దవాఖానలో మగబిడ్డకు జన్మనిచ్చింది. డెలివరీ సమయంలో షబానా బేగం రూ. 20 వేలు చెల్లించింది. దీంతో పుట్టిన బిడ్డ తనకే కావాలంటూ షబానా బేగం, హుమేరా బేగం నగరంలోని రాధాకృష్ణ థియేటర్‌వద్ద ఆశావర్కర్‌ జయతో గొడవపడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వారిని పీఎస్‌కు తరలించారు. బిడ్డను విక్రయించేందుకు సిద్ధమైన తల్లి దేవీని, విక్రయానికి సహకరించిన ఆశా వర్కర్‌ జయను, కొనుగోలు యత్నించిన హుమేరాబేగం, షబానాబేగంను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సమావేశంలో నగర సీఐ నరహరి, ఎస్సై ప్రవీణ్‌కుమార్‌, ఏఎస్సై లీలాకృష్ణ, కానిస్టేబుళ్లు అప్సర్‌, చాందిమి, సుమలత ఉన్నారు.

మెడికల్‌ షాప్‌లపై దాడులు

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి, మోర్తాడ్‌ మండల కేంద్రాల్లోని మెడికల్‌ షాప్‌లపై ఔషధ నియంత్రణ అధికారులు మంగళవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. నార్కోటిక్‌ డ్రగ్స్‌తో పాటు, షెడ్యూల్‌ హెచ్‌ డ్రగ్స్‌, హెచ్‌1 డ్రగ్స్‌తో పాటు ఇతర మందులను తనిఖీ చేశారు. తనిఖీ నివేదికను ఉన్నతాధికారులకు నివేదిస్తామని అధికారులు తెలిపారు. డాక్టర్‌ ప్రిస్క్రిప్షన్‌ లేకుండా నార్కోటిక్‌ డ్రగ్స్‌ (మత్తు కలిగించే మందులు) విక్రయించరాదని నిర్వాహకులను హెచ్చరించారు. దాడుల్లో డ్రగ్‌ ఇన్‌స్పెక్టర్లు ఆర్‌. శ్రీలత, వి. ఉపేంద్ర, వి. శ్రీకాంత్‌, ఎ. శ్రీలత తదితరులు ఉన్నారు.

